క్లుప్తంగా

పూర్వ విద్యార్థి వితరణ



విద్యార్థులకు సామగ్రిని అందిస్తున్న హెచ్ఎం పాత్రుడు, పూర్వ విద్యార్థి తరుణ్

నాతవరం: ఎం.బి.పట్నం హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి రూ.30 వేల సామగ్రి అందించడం ఆనందాయకమని హెచ్ఎం ఎల్.సిహెచ్.పాత్రుడు తెలిపారు. ఎ.శరభవరం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పెదిరెడ్ల తరుణ్ సోమవారం పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశాడు. ఈ ఏడాది నుంచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని తెలిపాడు. పూర్వ విద్యార్థిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు లేగదూడల ప్రదర్శన

మాడుగుల: పొంగలిపాకలో మంగళవారం ఉదయం 9 గంటలకు లేగదూడల ప్రదర్శన జరగనుందని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు తెలిపారు. కింతలి వల్లాపురం పశువైద్యశాల పరిధి జాలంపల్లి, ఎల్.పొన్నవోలు, పొంగలిపాక, కింతలి వల్లాపురం గ్రామాల్లోని ఏడాదిలోపు జెర్సీ హెచ్ఎఫ్, ఒంగోలు, ముర్రా గేదె జాతి దూడలను ప్రదర్శనకు తీసుకు రావాలని కోరారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



తూటిపాలలో టగ్ ఆఫ్ వార్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రెండు రోజులపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ పోటీలు నిర్వహించాలని విద్యా శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో తూటిపాల యూపీ స్కూల్లో సోమవారం టగ్ ఆఫ్ వార్ పోటీల్లో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. మంగళవారం అన్ని పాఠశాలల్లోనూ ఆటల పోటీలు కొనసాగుతాయని ఎంఈవో మూర్తి తెలిపారు.


వరిసాగులో జాగ్రత్తలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సేద్య సిబ్బంది

మాకవరపాలెం: వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రకృతి సేద్య సిబ్బంది రైతులు అవగాహన కల్పించారు. సోమవారం నారాయణరాజుపేటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని పొలాలను సందర్శించిన సిబ్బంది కాలిబాటలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. డీఏపీ బదులుగా ప్రకృతి విధానంలో ద్రవ జీవామృతం తయారు చేయడం, పొలాల్లో పిచికారీ చేసే విధానాలను తెలియజేశారు. ద్రవ జీవామృతం వాడటం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది పంటలు ఆరోగ్యకంగా ఉంటాయన్నారు. ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్, గణపతిలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 35 మంది ఎంపిక



కంటి శస్త్రచికిత్సలకు బయలు దేరుతున్న వృద్ధులు

దేవరాపల్లి: స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. 59 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 35 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. ఈ శిబిరంలో డాక్టరు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రతినిధి కె.భవానీ, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ అలేఖ్య, క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్. అశ్వినీకుమార్, నర్సింగ్, పుష్పలత, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరినారు కొరత.. రైతుల వెత

- కొనాలన్నా దొరకని వరినారు
- చివరి దశకు వచ్చిన ఖరీఫ్ నాట్లు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వరినారు



కొనుగోలు చేసిన వరి నారును బయటకు తెస్తున్న రైతులు

చోడవరం: ఖరీఫ్ సాగుకు వర్షాలు అనుకూలించకపోవడంతో సకాలంలో వరినాట్లు పూర్తి కాలేదు. ఇప్పుడు అడపాదడపా వర్షాలు కురుస్తున్న సమయంలో వరినారు కొరత ఏర్పడి రైతులు ఆపసోపాలు పడుతున్నారు. అదనపు ఖర్చు పెట్టి కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు.

ప్రభుత్వం ముందుగానే విత్తనాలు, రైతు భరోసా సాయం అందించడంతో రైతుల్లో వ్యవసాయం పట్ల కాస్త ఆసక్తి పెరిగింది. దాంతో సాధారణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు పెరగనుందని అధికారుల అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు చోడవరం నియోజకవర్గంలో 75 శాతం వరినాట్లు వేశారు. సీజన్ ఆఖరులో వర్షాలు అనుకూలించడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు కాకుండా వరి వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. జూన్, జులై నెలల్లో వర్షపాతం ఆశించిన మేర కురవకపోవడంతో మెట్ట ప్రాంతాల్లో చాలా చోట్ల వరినారు లభించలేదు. వారం రోజుల్లో ఆశించిన మేర వర్షాలు కురవడంతో వరి నారుకు డిమాండ్ వచ్చింది. నాట్లుకు కావలసిన వరినారు కొరత ఏర్పడింది. నారు ఎదగాల్సిన సమయంలో ఆశించిన మేర వర్షాలు లేకపోవడం, కొన్ని చోట్ల తెగుళ్లు సోకి నారు నాశనమవ్వడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

నారు కోసం అవస్థలు..

నారు కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతుల వద్ద అదనపు నారును రూ.1,600 నుంచి రూ.2 వేలకు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా ఆ నారును మడిలోంచి తీయడానికి కూలీలకు అదనంగా రూ.1,500 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కొనుగోలు చేసిన నారును పొలంలో నాటేందుకు మరో రూ.2 వేలు ఖర్చు చేయాల్సి రావడంతో అదనపు పెట్టుబడులతో కాస్త ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వరినారుకు ఎంత డిమాండ్ ఉందో చెప్పకనే చెబుతోంది. ఈ వారంలో వరినాట్లు పూర్తిగా వేసేందుకు పల్లం, మెట్ట రైతులు ఇప్పటికే దమ్ములు పట్టి, నాట్లు వేయడం ముమ్మరం చేశారు.

నారులేకపోతే వెదజల్లే పద్ధతిలో వేసుకోవాలి

వరినారు లేనివారు విత్తనాన్ని వెదజల్లే పద్ధతిలోను, డ్రమ్ సీడర్లతో వేసుకోవచ్చని వ్యవసాయ శాఖ చోడవరం అదనపు సంచాలకుడు రవీంద్రనాథ్ సూచించారు. పొలంలో నీరు పూర్తిగా ఆరిపోయిన తర్వాతే వెద విత్తనాన్ని వేయాలన్నారు.

రావికమతానికి కొత్తగా 278 పింఛన్ల మంజూరు



రావికమతంలో నూతన పింఛన్‌దారులతో మాట్లాడుతున్న ధర్మశ్రీ

విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమంతోపాటు అభివృద్ధి చేసి చూపిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నూతన పింఛనుదారులనుద్దేశించి ధర్మశ్రీ మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్న ఇంకా ఎవ్వరైనా అర్హులుంటే గుర్తించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, గృహసారథులు, వలంటీర్లతో ఇంటింటి సర్వే, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 2,62,169 మంది పింఛన్‌దారులకు రూ.216 కోట్లు మంజూరు చేశారన్నారు. రావికమతం మండలంలో 278 మందిని గుర్తించామని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నూతన పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నాయకులంతా పేదల గురించి మాట్లాడారని, జగనన్న ఒక్కరే వారిని గుర్తించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతూ నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. మళ్లీ మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి



గృహసారథుల నుంచి ఆధార్ తీసుకుంటున్న మండల నాయకులు

గొలుగొండ: గ్రామాల్లో నియమితులైన గృహసారథులు, కన్వీనర్లు బాధ్యతగా పనిచేసి మరలా వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మండల గ్రామ సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు పాణిశాంతారామ్, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత తెలిపారు. సోమవారం లింగంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట గ్రామాల్లో గృహసారథులు, కన్వీనర్లతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడం కోసం పనిచేయాలన్నారు. గృహసారథులు, కన్వీనర్లకు ఇన్సురెన్సు చేయడానికి కావాల్సిన పత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, లింగంపేట ఎంపీటీసీ గొంతిన మహాలక్ష్మి, నాయకులు కవి, మల్లేష్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బయట ఉంటే చర్యలు



సుగుణకు పుస్తకాలు అందిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

మాకవరపాలెం: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే బాధ్యత అందరూ తీసుకోవాలని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(జీఈఆర్)లో భాగంగా జి.వెంకటాపురంలో సుగుణ అనే డ్రాపవుట్ విద్యార్థిని సోమవారం కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ మొదటి ఏడాదిలో చేర్చారు. మండల కేంద్రానికి చెందిన లాలం పూజితను ఒకటో తరగతిలో చేర్చారు. ఈ సందర్భంగా ఎంఈవోలు లక్ష్మి, మూర్తి మాట్లాడుతూ 6–18 ఏళ్లలోపు వారు బడిబయట లేకుండా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. డివిజన్ వ్యాప్తంగా భూ సమస్యలు, తాగు, సాగునీరు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇసుక రీచ్‌లో ఇసుక సరఫరాపై 16 అర్జీలు వచ్చాయి. స్పందన ఫిర్యాదులకు అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. పరిష్కరించేందుకు అవకాశం లేకపోతే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. స్పందనలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయానికి ద్వార బంధం ఏర్పాటు

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పనుల పునః ప్రారంభం



ద్వార బంధానికి పూజలు చేస్తున్న వేదపండితుడు రేజేటి రామాచార్యులు



కొండపై నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

నాతవరం: ఈరుడి కొండపై రూ.3 కోట్లతో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సోమవారం ద్వారబంధం ఏర్పాటు చేశారు. ముందుగా కశింకోటకు చెందిన వేదపండితుడు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ద్వారబంధానికి 21 మంది దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి క్రేన్ సాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం ఈరుడి కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేదన్నారు. అలాంటి మహోన్నతమైన శక్తి లేకుండా ఇక్కడ ఆలయ నిర్మాణం సాధ్యం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు, దివంగత అంకంరెడ్డి జమీలు ఆకస్మిక మరణంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయని, మరలా పునఃప్రారంభించడం ఆనందాయకమన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసేంత వరకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఆలయ నిర్మాణం పూర్తి చేసి జమీలు ఆశయం నెరవేర్చాలన్నారు. నాతవరం ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, నాతవరం ఉప సర్పంచ్, ఆలయ కమిటీ అడ్వైజరు కరక అప్పలరాజు, నాతవరం వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మట్టవానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి దుర్గాప్రసాద్

రావికమతం: మట్టవానిపాలెంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్, సిబ్బంది 60 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. గ్రామంలో కొంత మందికి జ్వర లక్షణాలున్నట్టు ఆరోగ్య సిబ్బంది వైద్యాధికారి దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈ శిబిరం నిర్వహించారు. సర్పంచ్ శంకర్రావు పాల్గొని సహాయ సహకారాలు అందించారు.

రోడ్డుకు నిధులు మంజూరు చేయాలంటూ వినతి



కలెక్టరుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: మండలంలో 11 పంచాయతీలకు ఆధారమైన కింతలి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ స్పందనలో ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ వినతిపత్రం సమర్పించారు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు గురవడంతో 40 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనికి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్పందించి వెంటనే ఎస్టిమేషన్ తయారు చేసి నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీటీసీలు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు శానాపతి గంగాధర్, గొల్లవిల్లి రాజేష్, రాము, బొమ్మిశెట్టి శ్రీనువాసరావు పాల్గొన్నారు.

‘తారకరామ’పై రైతులను రెచ్చగొట్టడం తగదు

కేజేపురం వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, అప్పలనాయుడు, రమణబాబు తదితరులు

మాడుగుల రూరల్: గత టీడీపీ అధికారంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తారకరామ ప్రాజెక్టును పట్టించుకోలేదని, ఇప్పుడు నిరసన చేపట్టడానికి ఆయకట్టు రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలని కేజేపురం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు హితవు పలికారు. సోమవారం కేజేపురం తారకరామ ఆయకట్టు ప్రాంతంలో వారు మాట్లాడుతూ కనీసం జలాశయం గండి పూడ్చలేని వ్యక్తి రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. జలాశయానికి గండి పడితే అక్కడ గేట్లు ఏర్పాటు చేసి దిగువ రైతులకు సాగు నీరు అందించడానికి గత కాంగ్రెసు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులే ఈ పనులు అడ్డుకున్నారని దుయ్యబట్టారు. దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు హయాంలో ప్రారంభించిన ఈ జలాశయాన్ని ఆ తర్వాత వచ్చిన మాజీ సీఎం చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో పట్టించుకోలేదన్నారు. తారకరామ పంట కాలువల చైర్మన్లు అప్పటి ఎమ్మెల్యే రెడ్డి సత్యనారాయణ ద్వారా హైదరాబాదు వెళ్లి జలాశయాన్ని పూర్తి చేయాలని వినతి పత్రం అందించినా మొండిచేయి చూపారని దుయ్యబట్టారు. జలాశయం డిజైన్ సక్రమంగా లేకపోవడంతో పూర్వ ఆయకట్టు రైతులు నష్టపోతున్నారని చంద్రబాబుకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. తాజాగా వైఎస్సార్‌సీపీ అధికారంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రైతులను ఆదుకోవాలని ఇప్పటికే పెద్దేరు జలాశయం ఆధునికీకరణకు రూ.84.44 లక్షలు మంజూరు చేయించారన్నారు. నియోజకవర్గంలో ప్రతి జలాశయం ఆధునికీకరణకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మళ్ల కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, ఎల్లపు శ్రీనువాసరావు, పెంటకోట అప్పారావు, నీటి సంఘం సభ్యుడు ఎం. రమణ, పెంటకోట మాలినాయుడు, భీశెట్టి జగ్గప్పారావు, రైతులు మళ్ల కిశోర్, పీలా శ్రీను, కాళ్ల జగన్, ఆడారి భాస్కరరావు, ఆడారి గణేష్, ఎల్లపు రాము పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై చాపకట్టర్ యంత్రం



చాపకట్టర్‌ను యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తున్న వ్యవసాయ పనిముట్లు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. సోమవారం అప్పలరాజుపురం రైతు భరోసా కేంద్రంలో పాడిరైతు కురచా చక్రధర్‌కు రూ.33,790 విలువ చేసే చాపకట్టర్‌ను 40 శాతం రాయితీపై రూ.20,388 అందించారు. ఈ యంత్రాన్ని సర్పంచ్ చుక్కా అప్పలనాయుడుతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. చీడికాడ పశు వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 20 మంది రైతులు ఇప్పటి వరకు చాపకట్టర్లు తీసుకున్నారన్నారు. ఎంతమందికైనా అందిస్తామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేత కురచా నారాయణమూర్తి పాల్గొన్నారు.

మునగ మొక్కల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం



సూచనలు చేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: మునగ మొక్కలు పెంచేందుకు ముందుకొచ్చే రైతులకు ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు చేస్తామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునగ ఆకు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, అవి తినడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ విషయాన్ని పంచాయతీలో గ్రామసభలు ద్వారా రైతులకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకంలో మండల వ్యాప్తంగా చేపట్టే పనులపై చర్చించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సమస్య, స్పందన ఫిర్యాదులపై చర్చించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ఎం.ప్రసాద్, జేఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాలు



రైతులతో మాట్లాడుతున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల: వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. అవురువాడలో రైతులకు ఆయన అవగాహన కల్పించారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రం ద్వారా ఒక ట్రాక్టరు, రోటోవేటర్, మూడు పవర్ టిల్లర్లు గ్రూపు సభ్యులకు రాయితీపై అందజేస్తామన్నారు. గ్రామంలో షిర్డీసాయిబాబా వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రానికి ఒక యూనిట్ అందజేశామన్నారు. వీటిని ఇతర రైతులు అద్దెకు తీసుకోవచ్చన్నారు. మండలంలో 22 వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.1.60 కోట్ల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేశామన్నారు. ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి



రామచంద్రపురంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసిన నర్సింహమూర్తి

కె.కోటపాడు: 2000 ఆగస్టు 28న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో పోలీసుల తూటాలకు బలైన కార్మికులను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని సీపీఎం నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బషీర్‌బాగ్ ఘటనలో అమరులైన కార్మికులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. సీపీఎం నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, ఈర్లె నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో మరణించిన అమరవీరుల సంస్మరణ సభ సోమవారం శంకరం పంచాయతీ శివారు రామచంద్రపురంలో నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యురాలు కె. భవానీ అధ్యక్షతన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2000 ఆగస్టు 28న నాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం అతికిరాతకంగా కాల్పులు జరిపి, ముగ్గురి ప్రాణాలను బలిగొందని సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి ఆరోపించారు. విద్యుత్ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించడం ద్వారా తర్వాత ఎన్నికల్లో చంద్రబాబును గద్దె దించామన్నారు.

1న చలో విజయవాడ

మాడుగుల రూరల్: సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వచ్చే నెల 1న చేపట్టే చలో విజయవాడ విజయవంతం చేయాలని కోరుతూ సోమ వారం ఘాట్ రోడ్డు జంక్షన్‌లో అనకాపల్లి జిల్లా ఆర్థిక కార్యదర్శి గేదెల సింహాద్రప్పుడు గోడపత్రికను విడుదల చేశారు. జగనన్నకు చెబుదాం, వైనాట్ ఓపీఎస్ అంశంపై విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనాలన్నా రు. ఉపాధ్యాయులు పోలిమేర చంద్ర రావు, ప్రసాద్, ఆడారి అప్పారావు, శివకుమార్, సత్తిబాబు, రామారావు, బంటు శివకుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

రావికమతం: మూడు లీటర్ల సారాతో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. రాయవరంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేయగా ఆ గ్రామానికి చెందిన రావి సత్తిబాబు నుంచి మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేశామన్నారు.